


బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 7లో మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీలో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్




వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో శాంతి ర్యాలీలో జాతీయ పతాకాన్ని చేతబట్టుకుని పాల్గొన్న వెస్ట్‌జోన్ అదనపు డీసీపీ హనుమంతరావు, ఏసీపీ సుబ్బయ్య

# సోదరభావాన్ని పెంచేలా వేడుకలు

**ర్యాలీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్**

బంజారాహిల్స్,అక్టోబర్ 1: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో వాడవాడలా శాంతి ర్యాలీలు ఉత్సాహంగా నిర్వహించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజిగూడ,హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో మజీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం శాంతి ర్యాలీలను తీశారు. పలు బస్తీల్లో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రత్యేకంగా అన్నదానం చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 7లోని మజీదు వద్ద ఏర్పాటు చేసిన శాంతి ర్యాలీని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. సోదరభావాన్ని కలిగి ఉండాలని, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలని, ప్రపంచశాంతికి పాటు పడాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చేలా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారన్నారు.

**శాంతి ర్యాలీల్లో పాల్గొన్న అధికారులు..**

బంజారాహిల్స్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీల్లో పోలీసు అధికారులు జాతీయ పతాకాన్ని చేతబూని పాల్గొనడం ఆకట్టుకుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 7లో వెస్ట్‌జోన్ అదనపు డీసీపీ హనుమంతరావు, బంజారాహిల్స్ ఏసీపీ సుబ్బయ్య తదితరులు శాంతి ర్యాలీలో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని దేవరకొండబస్తీలో శాంతి ర్యాలీలో బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

**పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు..**

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ర్యాలీలను ప్రశాంతంగా నిర్వహించేలా బంజారాహిల్స్, ఫిలింనగర్, జూబ్లీహిల్స్ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఏసీపీలు హరిప్రసాద్, సుబ్బయ్యతో పాటు ఆయా పీఎస్‌ల ఇన్‌స్పెక్టర్లు రవీంద్రప్రసాద్, రామకృష్ణ,నరేందర్ ఆధ్వర్యంలో అన్ని సెక్టార్ల ఎస్‌ఐలు, సిబ్బంది ర్యాలీలు కొనసాగే ప్రాంతాల్లో బందోబస్తులో పాల్గొన్నారు.



జలగం వెంగళరావు పార్కులో వాకర్లతో కలిసి క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ చౌరస్తాలో రోడ్లను ఊడుస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బంజారాహిల్స్/హిమాయత్‌నగర్, అక్టోబర్ 1: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం దేశవ్యాప్తంగా 'స్వచ్ఛతా హీ సేవ' పేరుతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం జీహెచ్‌ఎంసీ సర్కిల్ -18 పరిధిలో ఉత్సాహంగా నిర్వహించారు. బస్తీలు, కాలనీలతో పాటు పార్కుల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పాటు అధికారులు గంటపాటు శ్రమదానం చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని లోటస్ పాండ్‌లో సర్కిల్-18 ఏఎంవోహెచ్ డా. రజినీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్కులోని చెత్తాచెదారాన్ని తొలగించారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని జలగం వెంగళరావు పార్కులో వాకర్లతో పాటు జీహెచ్‌ఎంసీ సిబ్బంది కలిసి గంటపాటు పార్కును శుభ్రం చేశారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతమ్ నగర్ చౌరస్తావద్ద స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంజయ్ సింగ్‌తో



బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని లోటస్ పాండ్‌లో ప్రత్యేక క్లీనింగ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

పాటు సిబ్బంది పాల్గొని రోడ్లను ఊడ్చారు.

**పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి ,అంబర్‌పేట సర్కిల్ -16 ఏఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతిబాయి అన్నారు. నారాయణగూడ, వెంకటస్వామి నగర్ బస్తీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతను పాటించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు పడే అవకాశం ఉందని, సంపూర్ణ స్వచ్ఛత కోసం ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ ఎస్ఎస్ తిరుపతి నాయక్,ఎస్‌ఎఫ్‌ఏలు శ్రీనివాస్, మధు, కామేష్, సతీష్‌చంద్ర, సోమయ్య,శ్రీనివాస్,అర్జున్ పాల్గొన్నారు.



సోమాజిగూడలోని రాజీవ్ సర్కిల్‌లో డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్ ..



నారాయణగూడలో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న మహాలక్ష్మిగౌడ్

# ఉత్సాహంగా మిస్ సౌత్ ఇండియా గ్రాండ్ ఫినాలే వేడుకలు

**మిస్ క్వీన్ తెలంగాణ -2023 విజేతగా అనూష కంఠం**

బంజారాహిల్స్, అక్టోబర్ 1: మణప్పురం మిస్ సౌత్ ఇండియా ఎడిషన్ గ్రాండ్ ఫినాలే పోటీలు శనివారం రాత్రి కేరళలోని కొచ్చిలో అంగరంగ వైభవంగా జరిగాయి. బంజారాహిల్స్‌లోని పెగాసిస్ గ్లోబల్, మణప్పురం సంస్థల ప్రతినిధి డా.అజిత్ రవి పోటీల వివరాలను వెల్లడించారు. మిస్ సౌత్ ఇండియా -2023 విజేతగా కేరళకు చెందిన హర్ష శ్రీకాంత్, తమిళనాడుకు చెందిన అక్షతా దాస్ రన్నరప్‌గా నిలవగా.. కేరళకు చెందిన రోస్మిన్ సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. కాగా, హైదరాబాద్‌కు చెందిన అనూష కంఠం మిస్ క్వీన్ తెలంగాణ -2023గా, ఏపీకి చెందిన ముస్కాన్ నాయర్ మిస్ క్వీన్ ఆంధ్రప్రదేశ్ -2023గా టైటిల్‌ను దక్కించుకుంది. దక్షిణాది రాష్ట్రాల నుంచి యువతులు పెద్ద ఎత్తున ఈ పోటీలకు దరఖాస్తు చేసుకోగా.. 20 మంది యువతులు మాత్రమే గ్రాండ్ ఫినాలేలో పోటీపడ్డారని నిర్వాహకులు తెలిపారు.



మిస్ క్వీన్ తెలంగాణ-2023గా ఎంపికైన అనూష కంఠంకు టైటిల్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

## శిక్షణ పొందిన ఉపాధ్యాయులతోనే సాధ్యం

హిమాయత్‌నగర్,అక్టోబర్1: రాష్ట్రంలోని భాషా పండితుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లోని ఆడిటోరియంలో పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ భాషా బోధన, క్రీడల నిర్వహణ సక్రమంగా సాగాలంటే పునాది నుంచే శిక్షణ పొందిన పండితులు,వ్యాయామ ఉపాధ్యాయులతోనే సాధ్యమన్నారు. భాషా పండితుల నుంచి స్కూల్ అసిస్టెంట్ భాషా ఉపాధాయులుగా, పీఈటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ పీఈటీలుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల కాంతి కృష్ణ,నాయకులు మీనా, శర్మ, ఘనపురం దేవేందర్, హమీద్‌ఖాన్, లక్ష్మీనారాయణ, కుమార్, విజయభాస్కర్, ప్రభావతి, బాల్‌రెడ్డి, రోహిత్, రవీంద్ర, స్వామి పాల్గొన్నారు.

## 4న గుర్రం జాషువా జయంతి ఉత్సవాలు

హిమాయత్‌నగర్,అక్టోబర్ 1: మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాలను ఈ నెల 4న నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సమతా సాహితీ వేదిక అధ్యక్షురాలు కాకుమాను శశిశ్రీ,మేరికొండ మూర్తి తెలిపారు. ఆదివారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. సమాజ సంస్కరణకు సాహిత్యాన్ని ఆయుధంగా ఎంచుకుని అసమానతలపై జాషువా గళమెత్తి సమాజంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేశారు.ఈ ఉత్సవాలకు రాష్ట్ర ఏసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చేతన,కవులు ఆచార్యశిఖమణి,డాక్టర్ కోయ కోటేశ్వరరావు, డాక్టర్ పసునూరి రవీందర్,న్యాయవాది చింతల శ్రీకాంత్ పాల్గొంటారని తెలిపారు.

## 1969 ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించండి

హిమాయత్‌నగర్,అక్టోబర్1: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969లో ఉద్యమం చేసిన ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆనాడు జరిగిన ఉద్యమం ఎంతో కీలకంగా మారిందని,ఆ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు వివిధ అనారోగ్యాలతో బాధపడు తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.ఉద్యమ కారులందరికీ గౌరవ ప్రదమైన పెన్షన్ సౌకర్యం,ఉచిత వైద్యం,ఉచిత బస్ సౌకర్యం,గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు వనం చంద్ర మౌళి, కె.మోహన్‌రావు,రచ్చ సుభద్రారెడ్డి, కార్యదర్శులు పి.వెంకటయ్య, కె.బాలయ్య, రాజు,ఎ.అరుణ,కొట్టం రవి పాల్గొన్నారు.